


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 583 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 12 బుధవారం నవంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం

## ఢిల్లీలో కారు బాంబు పేలుడు... సూత్రధారి డాక్టర్ ఉమర్

# ఫొటో విడుదల

- ఢిల్లీ ఎర్రకోట వద్ద కారులో భారీ పేలుడు
- ఘటనలో 9 మంది మృతి.. 20 మందికి పైగా గాయాలు
- సూత్రధారి డాక్టర్ ఉమర్ మహమ్మద్ ఫొటో విడుదల చేసిన పోలీసులు
- పుల్వామాలో అదుపులోకి ఉమర్ కుటుంబ సభ్యులు
- ఆత్మాహుతి దాడి కోణంలో పోలీసుల దర్యాప్తు


2


ఢిల్లీ, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 11 : దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన కారు బాంబు పేలుడు కేసులో కీలక పురోగతి లభించింది. ఈ దాడికి ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న డాక్టర్ ఉమర్ మహమ్మద్ ఫొటోను పోలీసులు తొలిసారిగా విడుదల చేశారు. ఈ భీకర పేలుడులో 9 మంది మృతి చెందగా, 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో నెమ్మదిగా వెళుతున్న హ్యుందాయ్ ఐ20 కారులో ఈ పేలుడు సంభవించింది.

## ఆలోచనతో రండి.. పారిశ్రామికవేత్తలు కండి:

-కనిగిరిలో ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించిన సీఎం చంద్రబాబు-సీఐఐ సదస్సులో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే టార్గెట్

-గత పాలనలో పరిశ్రమలు రాష్ట్రం విడిచి పారిపోయాయన్న సీఎం -2026 నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ

(యువత మంచి ఆలోచనలతో ముందుకు వస్తే, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే బాధ్యత తమదని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి 175 నియోజకవర్గాల్లో 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసి, లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తామని ఆయన ప్రకటించారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పెదఈర్లపాడులో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మరో 17 జిల్లాల్లో రూ.873 కోట్ల వ్యయంతో 868 ఎకరాల్లో అభివృద్ధి చేసిన 49 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటితో పాటు రూ.25,256 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటైన 38 మెగా

2


పారిశ్రామిక యూనిట్లను కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం పలు జిల్లాల పారిశ్రామికవేత్తలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

## ఉగ్ర కుట్రలో హైదరాబాద్ డాక్టర్‌దే

# కీలక పాత్ర


2

సింహగర్జన సంపాదకుడు, డా సునీల్ కుమార్ యాండ్ర :
దేశాన్ని భయభ్రాంతులకు గురిచేసేందుకు సిద్ధమవుతున్న భారీ ఉగ్రవాద కుట్రను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ సమర్థవంతంగా భగ్నం చేసింది. ఈ నెట్‌వర్క్‌లో పట్టుబడ్డ ప్రధాన సూత్రధారి ఎవరో కాదు. స్వయంగా హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్. గుజరాత్ ఏటీఎస్ అధికారులు అందించిన వివరాలు షాక్‌కు గురిచేస్తున్నాయి. మొహియుద్దీన్ సయ్యద్ (35), తన ఇంటిని ఏకంగా రహస్య ల్యాబ్‌గా మార్చుకున్నాడు. అక్కడ అతను ఆముదం గింజలను ప్రాసెస్ చేసి, వాటి వ్యర్థాల నుంచి అత్యంత ప్రమాదకరమైన 'రైసిన్' విషరసాయనాన్ని తయారు చేయడానికి ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు.

## ఎర్రకోట పేలుళ్ల సూత్రధారులను

# వదిలిపెట్టం

- : భూటాన్ నుంచి మోదీ హెచ్చరిక
- ఢిల్లీ ఎర్రకోట సమీపంలో కారులో భారీ పేలుడు
- భూటాన్ పర్యటన నుంచే తీవ్రంగా స్పందించిన ప్రధాని
- బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంటుందని భరోసా


2


## ఎగ్జిట్ పోల్ రిజల్ట్స్

# వచ్చేశాయ్..


### - గెలుపు వారిదేనట..!

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 11: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఎగ్జిట్ పోల్ సర్వే నివేదికలు వచ్చేశాయ్. జూబ్లీహిల్స్‌లో జయకేతనం ఎగురవేసేది ఎవరనే విషయాన్ని రిజల్ట్స్‌కు ముందే చెప్పేశాయ్. అక్టోబర్ 13వ తేదీ నుంచి మొదలైన... ఈ ఉప ఎన్నిక పోరులో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు హోరాహోరీగా తలపడ్డాయి. పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించాయి. ఇంత చేసిన పార్టీలకు.. ఓటర్లు ఎలాంటి తీర్పు ఇవ్వనున్నారు. సర్వే సంస్థలు.. ఓటర్ల నాడిని పసిగట్టాయా? ఓటర్ల అభిప్రాయం ప్రకారం జూబ్లీహిల్స్‌లో ఏ పార్టీ గెలువనుంది? సర్వే సంస్థలు ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్ వివరాలు మీకోస



2



సింహగర్జన
www.simhagarjana.com



# ఆలోచనతో రండి.. పారిశ్రామికవేత్తలు కండి:

**పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని చంద్రబాబు అన్నారు. "ఈ రోజు 99 కంపెనీలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నాం. వీటి ద్వారా రూ.2.65 లక్షల కోట్ల పెట్టుబడులతో 2 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. జనవరి నాటికి మరో 70 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభిస్తాం. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే మా లక్ష్యం" అని సీఎం వివరించారు.

టెక్నాలజీ భవిష్యత్తును శాసిస్తుందని, అందుకే అమరావతిలో జనవరికి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. సౌర విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్, బయో ఫ్యూయెల్ ప్లాంట్ల ఏర్పాటుతో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తామన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, త్వరలోనే సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటు కానున్నట్లు వెల్లడించారు. ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకోనున్నామని, తద్వారా 8 లక్షల ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

**గత పాలనపై తీవ్ర విమర్శలు**

గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం విడిచి పారిపోయారని, పరిశ్రమలు మూతపడ్డాయని చంద్రబాబు విమర్శించారు. "గతంలో పారిశ్రామికవేత్తలు 'ఛలోఛలో' అంటూ రాష్ట్రం నుంచి వెళ్లిపోతే, ఇప్పుడు 'భలేభలే' అంటూ తిరిగి వస్తున్నారు. విశాఖకు గూగుల్ సంస్థ లక్ష కోట్ల పెట్టుబడితో వస్తోంది. ఇదే మా ప్రభుత్వంపై ఉన్న నమ్మకం" అని అన్నారు.

గత పాలకులు పీపీఏలు రద్దు చేసి, విద్యుత్ వాడకుండానే రూ.9 వేల కోట్లు చెల్లించారని, ఆ డబ్బు ఉండి ఉంటే ఎన్నో ప్రాజెక్టులు పూర్తయ్యేవని ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసమైన ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం ఏ పాలసీ తెచ్చినా దేశంలో మొదట అమలు చేసేది ఏపీనే అని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి సహకారం అందిస్తుండగా, మంత్రి లోకేశ్ పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేస్తున్నారని ప్రశంసించారు.

**సంపద సృష్టి.. ప్రజల భాగస్వామ్యం**

రాష్ట్రంలో సంపద సృష్టించి, అందులో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. "ఆలోచనలే ఇప్పుడు ఆస్తి. లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతులు కూడా ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేసుకుని పారిశ్రామికవేత్తలుగా మారాలి," అని పిలుపునిచ్చారు. ఎంఎస్ఎంఈల ద్వారానే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించామన్నారు. రామాయపట్నం పోర్టు సమీపంలో బీపీసీఎల్ సంస్థ లక్ష కోట్ల పెట్టుబడితో రిఫైనరీ ఏర్పాటు చేస్తోందని, పోర్టులను అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని ఈస్ట్ కోస్ట్ లాజిస్టిక్స్ హబ్‌గా మారుస్తామని తెలిపారు. 15 శాతం వృద్ధి రేటు సాధించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

**వెనుకబడిన ప్రాంతాలకు పెద్దపీట**

వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిశ్రమలు, సాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. "2026 నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు నీళ్లిస్తాం. కనిగిరి ఇకపై కనకపట్నం అవుతుంది. కరవు పీడిత ప్రాంతాలైన కనిగిరి, యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాలకు గోదావరి జలాలను కూడా తీసుకొస్తాం. 2019లో మేం అధికారంలోకి రాకపోవడం వల్లే ఈ ప్రాజెక్టు ఆలస్యమైంది," అని అన్నారు. భవిష్యత్తులో ప్రజలకు ఇలాంటి కష్టాలు రాకుండా చూస్తామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు తదితరులు పాల్గొన్నారు

## పదోన్నతి పై రాజాం మున్సిపల్ కమిషనర్‌గా వెళుతున్న శానిటరీ ఇన్స్పెక్టర్ రామచంద్రరావుకు ప్రజారోగ్య సిబ్బంది ఘనసత్కారం

రేపల్లె

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే మున్సిపల్ కమిషనర్ గా పదోన్నతి పై రాజాం మున్సిపాలిటీకి వెళుతున్న రేపల్లె పురపాలక సానిటరీ ఇన్స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు ను రేపల్లె మున్సిపాలిటీ ప్రజారోగ్య శాఖ సిబ్బంది ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఏఐటీయూసీ నాయకులు ఘనంగా సత్కరించారు మంగళవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో రామచంద్రరావుకు అభినందన సభ సత్కార కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ కే సాంబశివరావు మాట్లాడుతూ విధినిర్వహణలో రామచంద్ర రావు ఇన్స్పెక్టర్గా అంకితభావంతో పనిచేసే రేపల్లె పట్టణ అభివృద్ధికి బాగా పనిచేశారన్నారు తనకు చేదోడు వాదోడుగా ఉంటూ పారిశుధ్యం పట్టణంలో



మెరుగుపరచడంలో రామచంద్రరావు వృత్తి ధర్మంలో తన వంతు పట్టణ ప్రజలకు సేవలు అందించారన్నారు ఏఐటీయూసీ సీనియర్ నాయకులు కన్నెగంటి రమేష్ మాట్లాడుతూ పారిశుధ్య అధికారిగా అనతి కాలంలోనే పట్నంలో పారిశుద్యాన్ని మెరుగుపరచడంలో రామచంద్ర రావు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ప్రజల మన్ననలు పొందారన్నారు రేపల్లె మున్సిపాలిటీలో గతంలో పనిచేసిన శానిటరీ ఇన్స్పెక్టర్లకు అంత గుర్తింపు రాలేదని రామచంద్రరావు పట్టణంలో ఇన్స్పెక్టర్గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పరిసరాలు పరిశుభ్రత లక్ష్యంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో సభలో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తూ విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు ఈ సందర్భంగా ఘనంగా రామచంద్రరావును ప్రజారోగ్య సిబ్బంది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సత్కరించారు ఆయన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా మహిళా కార్యదర్శి ఎస్ వాణిశ్రీ.... పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ పై కిషోర్ బాబు.. రేపులతాలిక ఎన్జీవో యూనిట్ అధ్యక్షులు అంకమ్మరావు రేపల్లె లైన్స్ క్లబ్ అధ్యక్షులు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం రేపల్లె మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సుగ్గుల సుదర్శనం.. ఏఐటియుసి పట్టణ అధ్యక్షులు కోన శ్రీనివాసరావు ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడమటి భిక్షాలు మోహిద్దీన్ రామచంద్ర రావు ఏపీ ఎన్జీవోస్ కార్యదర్శి గంగాధర్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ సిరంశెట్టి శ్రీనివాసరావు ప్రజారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఢిల్లీ పేలుడు.. కీలక సూత్రధారి ఈమే..!!

ఢిల్లీ, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 11 : ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుడు కేసులో అరెస్టైన మహిళ డాక్టర్ షాహీన్ ఫొటో బయటికొచ్చింది. అధికారుల విచారణలో విస్తుపోయే నిజాలు బయటకొస్తున్నాయి. అల్ ఫలాహ్ వర్సిటీలో ప్రొఫెసర్ పనిచేస్తున్న ఆమె ఉగ్రవాద ఆపరేషను నిధులు సమకూర్చడం, ఆపరేషన్ను సులభతరం చేయడంలో కీలకంగా పనిచేసినట్లు గుర్తించారు. దేశంలో జైషే మహ్మద్ కోసం మహిళా నియామకాలను షాహీన్ పర్యవేక్షిస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి..!!

## ఢిల్లీలో కారు బాంబు పేలుడు... సూత్రధారి డాక్టర్ ఉమర్ ఫొటో విడుదల

పేలుడు తీవ్రతకు కారు ముక్కలైంది. ఆ సమయంలో కారులో ముగ్గురు వ్యక్తులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం కావడంతో ఎర్రకోటకు సెలవు ప్రకటించడం వల్ల పెను ప్రమాదం తప్పిందని, లేదంటే ప్రాణనష్టం భారీగా ఉండేదని అధికారులు తెలిపారు. క్షతగాత్రులను సమీపంలోని ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఆత్మాహుతి దాడి అయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. "గాయపడిన వారి శరీరాలపై పేలుళ్లలో సాధారణంగా కనిపించే పదునైన వస్తువులు లేదా గాట్లు ఏవీ లేవు. ఇది కాస్త అసాధారణంగా ఉంది. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు ముమ్మరం చేశాం" అని ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. అమ్మోనియం నైట్రేట్, ఫ్యూయల్ ఆయిల్ వంటి శక్తిమంతమైన పేలుడు పదార్థాల మిశ్రమాన్ని వాడినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ పేలుడుకు కొన్ని గంటల ముందే ఫరీదాబాద్‌లో ఓ కాశ్మీరీ వైద్యుడు అద్దెకు ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో పోలీసులు భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. జమ్మూకశ్మీర్, హర్యానా, యూపీ పోలీసులు సంయుక్తంగా జరిపిన ఈ దాడుల్లో సుమారు 360 కిలోల అమ్మోనియం నైట్రేట్, ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు పుల్వామాలో ఉన్న డాక్టర్ ఉమర్ కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే, పేలుడులో సూత్రధారి ఉమర్ మరణించాడా? లేక పరారీలో ఉన్నాడా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## మరో తుఫాను ముప్పు.. మళ్లీ ఏపీలో వర్షాలు!



శ్రీకాకుళం నవంబర్ 11

ఏపీలో మొంథా తుఫాను విధ్వంసం నుంచి కోలుకోక ముందే రాష్ట్రాన్ని మరో ముంపు ముప్పు వెంటాడుతుంది ఈ నెల 19 లేదా 20వ తేదీన బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఇస్రో వాతావరణం శాఖ నిపుణులు వెల్లడించారు. ఇది తుఫానుగా బలపడి ఈ నెల 25 నాటికి తీరం దాటవచ్చని దీని ప్రభావంతో కోస్తా జిల్లాలపై భారీ వర్షా ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

అలాగే మరో నాలుగు రోజుల్లో శ్రీలంక సమీపంలో అల్పపీడనం ఏర్పడుతుందని దీని ప్రభావంతో ఏపీ రాష్ట్రంలో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలియజేశారు.

## ఉగ్ర కుట్రలో హైదరాబాద్ డాక్టర్‌దే కీలక పాత్ర

నిపుణుల ప్రకారం, రైసిన్ అనేది అతి తక్కువ మోతాదులోనూ ప్రాణాలను తీయగలిగే అత్యంత శక్తిమంతమైన విష రసాయనం. మోహియుద్దీన్ తన ఉగ్ర కార్యకలాపాల కోసం రద్దీగా ఉండే ప్రాంతాలనే లక్ష్యంగా ఎంచుకున్నాడు. ఢిల్లీ ఆజాద్‌పూర్ మండీ (మార్కెట్), అహ్మదాబాద్ నరోడా ఫ్రూట్ మార్కెట్, లఖ్‌నవూ ఆర్ఎస్ఎస్ ఆఫీసు, ఈ ప్రాంతాల్లో జనం రద్దీ అధికంగా ఉండటంతో పెద్ద ఎత్తున ప్రాణనష్టం కలిగించడానికి అనువైన అవకాశముందని నిందితుడు భావించినట్లు యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ డీఐజీ సునీల్ జోషి మీడియాకు తెలిపారు. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ప్రకారం బాగా చదువుకున్న మొహియుద్దీన్ తీవ్రవాద భావజాలంతో ప్రభావితమయ్యాడు. అతను కేవలం రైసిన్ తయారు చేయడమే కాక, ఉగ్రదాడికి నిధులు సేకరించడం మరియు వ్యక్తులను నియమించడం వంటి పెద్ద ప్రణాళికలను రూపొందించాడు. ఈ కేసులో మరో ఇద్దరు ఐసిస్ సానుభూతిపరులను కూడా యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ అదుపులోకి తీసుకుంది. మొహియుద్దీన్ అరెస్ట్ విషయంపై ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొహియుద్దీన్ సోదరుడు ఉమర్ మాట్లాడుతూ తమ సోదరుడికి గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదని తెలిపారు. ఎవరో బిజినెస్ పేరుతో మోసం చేసి, అతడిని ఉగ్ర కార్యకలాపాల్లోకి లాగి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని ఆయన కోరుతున్నారు.

## ఎగ్జిట్ పోల్ రిజల్ట్స్ వచ్చేశాయ్..

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఎగ్జిట్ పోల్స్‌లో కాంగ్రెస్ వైపే ఓటర్లు

పబ్లిక్ పల్స్ : కాంగ్రెస్ 48.5%, బిఆర్ఎస్ 41.8%, బిజెపి 6.5% ఓట్లు

చాణక్య స్ట్రాటజీస్ : కాంగ్రెస్ 46%, బిఆర్ఎస్ 43%, బిజెపి 6% ఓట్లు

నాగన్న సర్వే : కాంగ్రెస్ 47%, బిఆర్ఎస్ 41%, బిజెపి 8% ఓట్లు

ఆపరేషన్ చాణక్య : 8 వేల ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్‌దే విజయమని సర్వే

జాన్ మైన్ సర్వే : కాంగ్రెస్ 42.5%, బిఆర్ఎస్ 41.5%, బిజెపి 11.5% ఓట్లు


హెచ్ఎంఆర్ సర్వే : కాంగ్రెస్ 48.31%, బిఆర్ఎస్ 43.18%, బిజెపి 5.84% ఓట్లు

స్మార్ట్‌పోల్ : కాంగ్రెస్ 48.2%, బిఆర్ఎస్ 42.1%, బిజెపి 7.6% ఓట్లు.

సింహగర్జన : కాంగ్రెస్ 48%, బిఆర్ఎస్ 44%, బిజెపి 10% ఓట్లు.

## పట్టుబడతాననే భయంతోనే.. ఢిల్లీ బాంబు పేలుడులో కీలక విషయం వెలుగులోకి..!

**- తన దగ్గరున్న పేలుడు పదార్థాలతో ఆత్మాహుతి దాడి- డిటోనేటర్లు, అమ్మోనియం నైట్రేట్, ఇంధనాలతో పేలుడు- ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని పోలీసుల వివరణ**



ఢిల్లీ, సింహగర్జన సంపాదకుడు, డా సునీల్ కుమార్ యాంద్ర, నవంబర్ 11 : ఢిల్లీలో చోటుచేసుకున్న బాంబు పేలుడు ఘటనలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. సోమవారం ఫరీదాబాద్ లో ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులను భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఆ గ్యాంగుకు చెందిన వ్యక్తే సోమవారం బాంబు పేలుడుకు కారణమని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. సహచరులు దొరికిపోవడంతో తాను కూడా పట్టుబడతాననే ఆందోళనకు గురైన నిందితుడు ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడి జరిపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఫరీదాబాద్ లో పట్టుబడిన అనుమానిత ఉగ్రవాదుల వద్ద స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల వంటివే తాజా బాంబ్ బ్లాస్ట్ లో ఉపయోగించినట్లు అధికారులు గుర్తించారు. డిటోనేటర్లు, అమ్మోనియం నైట్రేట్ తో పాటు ఇంధనం ఉపయోగించి పేలుడు జరిపినట్లు తెలిపారు. పేలుడు జరిగిన కారులో ఉన్న వ్యక్తిని డాక్టర్ ఉమర్ మహ్మద్ గా పోలీసులు గుర్తించారు. సోమవారం పట్టుబడ్డ ఉగ్రవాద ముఠాకు, ఉమర్ మహ్మద్ కు సంబంధం ఉందని భావిస్తున్నారు. పేలుడు జరిగిన సమయంలో కారులో ఉమర్‌తోపాటు ఇంకెవరైనా ఉన్నారా? అనే విషయం తెలుసుకోవడానికి దర్యాగంజ్, పహార్‌గంజ్ ప్రాంతాలలోని హోటళ్లు, లాడ్జిల ఎంట్రీలను తనిఖీ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

## ఎర్రకోట పేలుళ్ల సూత్రధారులను వదిలిపెట్టం

: ఢిల్లీ, సింహగర్జన సంపాదకుడు, డా సునీల్ కుమార్ యాంద్ర, నవంబర్ 11 : ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. ఈ దారుణానికి పాల్పడిన కుట్రదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ఆయన హెచ్చరించారు. నిన్న సాయంత్రం జరిగిన ఈ ఘటనలో 12 మంది మరణించగా, 20 మంది గాయపడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండు రోజుల పర్యటన నిమిత్తం భూటాన్‌లో ఉన్న ప్రధాని మోదీ థింపూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ పేలుళ్ల వెనుక ఉన్న కుట్రను మన దర్యాప్తు సంస్థలు ఛేదిస్తాయి. సూత్రధారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. బాధ్యులైన ప్రతి ఒక్కరినీ న్యాయస్థానం ముందు నిలబెడతాం" అని మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, ఎంతో భారమైన హృదయంతో ఇక్కడికి వచ్చానని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. "నిన్న సాయంత్రం జరిగిన ఈ భయానక ఘటన అందరినీ విషాదంలోకి నెట్టింది. బాధిత కుటుంబాల దుఃఖాన్ని నేను అర్థం చేసుకోగలను. ఈ కష్ట సమయంలో యావత్ దేశం వారికి అండగా నిలుస్తుంది" అని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న అన్ని ఏజెన్సీలతో తాను రాత్రంతా అందుబాటులోనే ఉన్నానని ప్రధాని మోదీ వెల్లడించారు.



## వైసీపీకీ ఓ ఉపఎన్నిక టానిక్ అవసరం

# ధైర్యం చేస్తారా?



హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 11 : జూబ్లిహిల్స్ ఉపఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్న విషయం పక్కన పెడితే కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీ హెూరాహెూరీగా సాగింది. ఆన్ లైన్, ఆఫ్ లైన్ ప్రచారంలో బీఆర్ఎస్ దూకుడు చూపించింది. పార్లమెంట్ ఎన్నికల్లో సగం సీట్లలో డిపాజిట్ కోల్పోయిన ఆ పార్టీ తాము రేసులోనే ఉన్నామని నిరూపించడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించింది. గెలుపోటములతో సంబంధం లేకుండా బలమైన పార్టీగా ఉన్నామన్న సంకేతాలు పంపారు. అసలు ఆ పార్టీ ఉనికి ప్రశ్నార్థకం అవుతుందన్న సమయంలో అనుకోకుండా వచ్చిన ఉప ఎన్నిక ఆ పార్టీకి ఊపిరి పోసింది. ఇప్పుడు అలాంటి ఊపిరి వైసీపీకి కూడా అవసరం. అందుకే ఓ ఉపఎన్నిక వస్తే బాగుండని వైసీపీ క్యాడర్ కోరుకుంటున్నారు.

**- ఉపఎన్నిక వస్తే ప్రభుత్వ వ్యతిరేకత పై ప్రచారం చేయవచ్చు !**

ఉపఎన్నిక వస్తే ప్రభుత్వ వ్యతిరేకత పెరిగిపోయిందని ప్రచారం చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. బీఆర్ఎస్ పార్టీకి ఇప్పుడు అదే అవకాశం వచ్చింది. సద్వినియోగం చేసుకుంది. నిజానికి ఉపఎన్నికల పవర్ ఏంటో వైసీపీకి తెలియనిది కాదు. ఉపఎన్నికలతోనే ఆ పార్టీ ఒకప్పుడు బలపడింది. ఇప్పుడు కూడా క్లిష్ట పరిస్థితుల్లో అలాంటి ఉప ఎన్నికలతోనే బలపడితే మళ్లీ రేసులోకి రావొచ్చని కొంత మంది సలహాలిస్తున్నారు. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని జగన్ రెడ్డితో పాటు వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. అది రాజకీయంగా కాదని, నిజంగానే ఎక్కువగా వ్యతిరేకత ఉందని వైసీపీలో కొంత మంది గట్టిగా నమ్ముతున్నారు. అదే నిజం అయితే ఉపఎన్నిక వారి పార్టీకి బూస్ట్ తెచ్చి ఇస్తుంది.

**- అత్యంత బలమైన సీటులో ఉపఎన్నిక తెచ్చుకుంటే సేఫ్!**

బీఆర్ఎస్ పార్టీకి ఉపఎన్నిక బూస్ట్ ఇచ్చిన వైనం చూసిన తర్వాత వైసీపీ కూడా ఉపఎన్నిక వల్ల ప్రయోజనాలు పొందాలని అనుకోవడంలో తప్పులేదు. అయితే వైసీపీ ఆషామాషీగా ఉపఎన్నికలకు వెళ్లకూడదు. తమ పదకొండు మందిలో ఎవరో ఒకరితో రాజీమానా చేయించి ఉపఎన్నిక తీసుకు వస్తే ఆ సీటు నిలబెట్టుకోవడం కష్టం అవుతుంది. అత్యంత బలంగా ఉన్న తిరుగులేని విజయం సాధించే అవకాశం ఉన్నసీటును ఎంచుకోవాలి. ఆ సీటు పులివెందుల లేదా.. పెద్దిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు అవ్వొచ్చు. కానీ రాజకీయంగా మరింత ఇంపాక్ట్ చూపించాలంటే ఖచ్చితంగా పులివెందులకు ఉపఎన్నిక వచ్చేలా చూస్తే బెటరని అనుకుంటున్నారు.

**- ప్రత్యేక హెూదా ఇవ్వలేదని జగన్ రాజీనామా చేస్తే రిఫరెండం !**

జగన్ రెడ్డి అసెంబ్లీకి పోవడం లేదు. పోవాలని కూడా అనుకోవడం లేదు. కోర్టులో పిటిషన్లు వేస్తే ముందుకు సాగడం లేదు. అందుకే ఇప్పుడు పులివెందుల ప్రజల వద్దకే తీర్పునకు వెళ్లి.. తనకు ప్రతిపక్ష హెూదా ఇవ్వాలనే వాయిస్ ను తిరుగులేని మెజార్టీ ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి చూపించాలని ఆయన రాజీనామా చేస్తే రాజకీయం ఎఫెక్టివ్ గా మారుతుంది. ఏం చేసినా టీడీపీ అక్కడ గెలవదని.. వైసీపీ నేతల నమ్మకం. అందుకే ఈ సీటు ద్వారా ఉపఎన్నిక తెచ్చుకుని, తిరుగులేని మెజారిటీ తెచ్చుకుని ఏపీలో కూటమి ప్రభుత్వం పని అయిపోయిందని, ప్రజాభిప్రాయం మారిపోయిందని నిరూపిస్తే ఇక జగన్ కు, వైసీపీకి వచ్చే ఎన్నికల వరకూ చింత లేనట్లుగానే ఉంటుంది.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మీటింగ్ హాల్ నిర్మించాలి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టి పెల్లి సైదులు**

ఆత్మకూర్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 11 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మీటింగ్ హాల్ నిర్మాణం వెంటనే చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆత్మకూర్ (ఎస్) మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ పిలుపులో భాగంగా ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మీటింగ్ హాల్ లేకపోవడంతో బయట చెట్ల కింద సమావేశాలు నిర్వహించాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే బడ్జెట్ కేటాయించి మీటింగ్ హాల్ నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న మౌలిక సమస్యలు పరిష్కరించి సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. రోగులు తాగటానికి కనీసం మంచినీళ్లు లేవన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కుక్కకాటు మందు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం తక్షణమే కుక్క కాటు మందు రోగులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రిలో బెడ్ల సంఖ్య ఆరు నుండి 50కి పెంచాలన్నారు. ఆసుపత్రిలో జనరేటర్ లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే జనరేటర్ సౌకర్యం కల్పించాలన్నారు. మందుల కొరతను నివారించి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి అటెండర్ ల సంఖ్యను పెంచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న ఏఎన్ఎం లను పర్మనెంట్ చేయాలన్నారు. ప్రాథమిక



ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటలు వైద్యం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ యాతాకుల వెంకన్న, రైతు సంఘం మండల నాయకులు యాతాకుల మల్లయ్య, డివైఎఫ్ఐ మండల నాయకులు ములకలపల్లి మహేందర్, బొడ్డు కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**- ఐకెపి కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని కాంట వెయ్యాలి**

**- వరి, పత్తి, మిర్చి, ఇతర వాణిజ్య పంటలు కోల్పోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి**

**- రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలి**

**- పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిపులను వెంటనే విడుదల చేయాలి**

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి**




సూర్యాపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 11 : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి ఐకెపి కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని కాంట వేసి లిఫ్ట్ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతాంగం ఆరు గాలాలపాటు వ్యవసాయం చేసి ఐకెపి కేంద్రాలకు తరలించిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి లిఫ్ట్ చేసి రైతాంగానికి వెంటనే బిల్లులు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఐకెపి కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి నెలలు గడుస్తున్న వాటిని నేటి వరకు కాంటాలు వెయ్యలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే ఐకెపి కేంద్రాలకు లారీలను చేసి వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్టుగా కాంటాలు వేసి మిల్లులకు తరలించాలన్నారు. ఇటీవల కురిసిన తుఫాన్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, ఇతర వాణిజ్య పంటలతో పాటు కూరగాయలు తీవ్రంగా నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరి పంటకు ఎకరాకు 30 వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. పత్తి పంటకు ఎకరాకు 50 వేలు, ఇతర వాణిజ్య పంటలకు 70 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతాంగానికి సహాయం అందించాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిపులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఫీజు రియంబర్స్ మెంట్,స్కాలర్ షిపులను మరింత పారదర్శకంగా అమలు చేస్తామని ఎన్నికల ప్రణాళికలు పేర్కొన్నారని గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకు వీటిని చెల్లించడంలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతుందన్నారు. పెండింగ్ బకాయిలను చెల్లించి ఎస్సీ, ఎస్ టి, బిసి, మైనారిటీ పేద విద్యార్థులకు చదువు ఆటంకం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ని 1800 ప్రైవేట్ కాలేజీలో చదివే,14 లక్షల మంది విద్యార్థులకు 8,042 కోట్లు ఫీజు రియంబర్స్ మెంట్,రూ. 1924 కోట్లు స్కాలర్ షిప్ లను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా మొత్తం రూ.9,966 కోట్లు పెండింగ్ పెట్టిందని పేర్కొన్నారు. వీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం కేవలం 300 కోట్లు మాత్రమే విడుదల చేసింది అన్నారు. వీటి విడుదల కోసం గత 20 రోజులుగా విద్యార్థి సంఘాలు యాజమాన్యాలు ఆందోళన చేస్తున్నాయన్నారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మిగతారూ. 900 కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోలిశెట్టి యాదగిరిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, కోట గోపి పాల్గొన్నారు.

## హైదరాబాద్ - విజయవాడ హైవేపై

# బస్సులో మంటలు..

**-డ్రైవర్ చాకచక్యంతో తప్పిన పెను ప్రమాదం**

**- విహారీ ట్రావెల్స్ బస్సులో చెలరేగిన మంటలు**


**- డ్రైవర్ చాకచక్యంతో సురక్షితంగా బయటపడ్డ 40 మంది**

**- చిట్యాల మండలం పిట్టంపల్లి వద్ద ఘటన**

**- పూర్తిగా కాలి బూడిదైన ప్రైవేట్ బస్సు**

**- మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది**

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 11 : హైదరాబాద్ – విజయవాడ 65వ జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. 40 మంది ప్రయాణికులతో వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన నల్గొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే విహారీ ట్రావెల్స్కు చెందిన బస్సు 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరింది. బస్సు పిట్టంపల్లి వద్దకు చేరుకోగానే ఇంజిన్ భాగం నుంచి మంటలు రావడం డ్రైవర్ గమనించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే బస్సును రోడ్డు పక్కన నిలిపివేసి, ప్రయాణికులను అప్రమత్తం చేశారు. దీంతో వారంతా క్షణాల్లో బస్సు దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. ప్రయాణికులు దిగిన కొద్దిసేపటికే మంటలు బస్సు మొత్తానికి వ్యాపించి, పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో బస్సు కాలి బూడిదైనప్పటికీ, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడం వల్లే పెను ప్రమాదం తప్పింది



## అందెశ్రీ పాడె మోసిన సీఎం రేవంత్

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 11 : ప్రజాకవి అందెశ్రీ అంత్యక్రియలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఆయన పార్థివ దేహానికి నివాళి అర్పించారు. అంతిమయాత్ర సందర్భంగా పాడె మోశారు. అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, జూపల్లి కృష్ణారావు కూడా అందెశ్రీ అంత్యక్రియల్లో పాల్గొని నివాళి అర్పించారు.



## వైసీపీ టౌన్ సోషల్ మీడియా కన్వీనర్ గా కిరణ్ కుమార్ గౌడ

మండపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 11 : మండపేట వైసిపి టౌన్ సోషల్ మీడియా కన్వీనర్ గా పట్టణానికి చెందిన వీరి కిరణ్ కుమార్ గౌడ్ ను పార్టీ నియమించింది. కిరణ్ కుమార్ గౌడ్ వైసిపి ఆవిర్భవం నుండి ఆ పార్టీ క్రియాశీలక కార్యకర్తగా ఉన్నారు. గత వైసీపీ హయాంలో రేషన్ వాహనాల ఆపరేటర్ యూనియన్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో జిల్లా వైసిపి అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మండపేట నియోజకవర్గ వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆశీస్సులతో తనను ఈ పదవిలో నియమించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



## ఇకపై అలాంటి పాత్రలు చేయను: మీనాక్షి చౌదరి



టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకెళుతున్న యువ హీరోయిన్ మీనాక్షి చౌదరి తన కెరీర్ విషయంలో ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్తులో పిల్లల తల్లిగా కనిపించే పాత్రలు చేయబోనని ఆమె తేల్చి చెప్పారు. 'హిట్ 2' చిత్రంతో భారీ విజయాన్ని అందుకుని, ఆపై 'గుంటూరు కారం'లో మహేశ్ బాబు సరసన మెరిసిన ఈ బ్యూటీ, ప్రస్తుతం ఇండస్ట్రీలో బిజీగా రాణిస్తున్నారు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మీనాక్షి, తన సినీ ప్రయాణం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన 'లక్కీ భాస్కర్' సినిమాలో కథ నచ్చడం వల్లే తల్లి పాత్రలో కనిపించాను. అయితే భవిష్యత్తులో అలాంటి పాత్రలు వస్తే మొహమాటం లేకుండా 'నో' చెబుతాను. నటిగా ఎలాంటి పాత్ర అయినా చేయాలి, కానీ కొన్ని పరిమితులు పెట్టుకోవడం అవసరం" అని ఆమె స్పష్టం చేశారు. సీనియర్ హీరోలతో కలిసి నటించడం తనకు ఇబ్బంది కాదని, దానిని ఒక కొత్త జానర్‌గా భావిస్తానని ఆమె పేర్కొన్నారు.'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన మీనాక్షి, 'హిట్ 2'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అగ్ర హీరోల సరసన నటిస్తున్నారు. ప్రస్తుతం ఆమె మెగాస్టార్ చిరంజీవితో కలిసి 'విశ్వంభర' చిత్రంలో నటిస్తున్నారు. "చిరంజీవి గారితో చేస్తున్న విశ్వంభర సినిమా నా కెరీర్‌లో ఒక స్పెషల్ చాప్టర్‌గా నిలిచిపోతుందనే నమ్మకం ఉంది" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు. అలాగే, వెంకటేశ్‌తో కలిసి నటిస్తున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా షూటింగ్‌ను కూడా ఎంతో ఆస్వాదించానని తెలిపారు.తనపై వచ్చే రూమర్ల గురించి కూడా మీనాక్షి స్పందించారు. "నా గురించి ఏదైనా విషయం చెప్పాలంటే నేనే స్వయంగా చెబుతాను. నాకు సోషల్ మీడియా ఉంది. కాబట్టి అనవసరమైన వదంతులను ఎవరూ సృష్టించాల్సిన పనిలేదు" అంటూ పుకార్లకు ఘాటుగా సమాధానమిచ్చారు.

## తెరపైకి కొత్త తార — నూతన నటి శ్రీమణి!

తెలుగు సినీ రంగం మరో కొత్త ప్రతిభను స్వాగతించబోతోంది. ఆ నూతన నటి శ్రీమణి. సౌమ్యమైన అందం, సహజమైన అభినయం, చక్కని డైలాగ్ డెలివరీతో ఆమె ఇప్పటికే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.

ఆమె మాట్లాడుతూ — "నాకు చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తి ఉంది. ఈ అవకాశాన్ని నా జీవితంలో మొదటి అడుగుగా తీసుకుంటున్నాను. మంచి కథలతో, మంచి దర్శకుల మార్గదర్శకత్వంలో పని చేయాలనుకుంటున్నాను," అని తెలిపారు.తెలుగు సినీ ప్రేక్షకులకు కొత్త ముఖాలు ఎప్పుడూ ఆసక్తికరమే. ఇప్పుడు ఆ జాబితాలోకి మరో ప్రతిభావంతురాలు చేరింది,.

— **శ్రీమణి.**

ఆమె ప్రయాణం ఎలా ఉంటుందో చూడాలి కానీ, మొదటి చూపులోనే **" కొత్త తార "** పుట్టిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.




# నీతా శర్మ ఒక ఇంటర్వ్యూలో హృదయాలను, మనసులను దోచుకుంది

- ఆమె అందం 'విషపూరిత మద్యం' లాంటిది!
- "గాగుల్స్‌లో ఆకర్షణీయంగా, చిలుక-ఆకుపచ్చ రంగులో పరిపూర్ణంగా"
- అందం, ఆత్మవిశ్వాసం మరియు శైలి యొక్క పరిపూర్ణ సమ్మేళనం
- నీతా శర్మ ఇంటర్వ్యూ క్యారమ్‌లో అందరినీ ఆశ్చర్యపరిచింది







ముంబై, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 11 : ప్రముఖ చలనచిత్ర మరియు మోడలింగ్ వ్యక్తిత్వం నీతా శర్మ ఇటీవల ఒక ఇంటర్వ్యూ సెషన్‌లో తనను తాను కొత్త లుక్‌లో ప్రదర్శించింది, మీడియా మరియు సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. చిలుక-ఆకుపచ్చ రంగు దుస్తులలో ఆమె శైలి "ఆమె అందం మరియు ఆత్మవిశ్వాసం వాతావరణాన్ని వెలిగించాయి!" అని చెప్పబడుతున్నది.

– స్టైల్ %ఢ% లుక్ : నీతా ట్రెండీ గాగుల్స్ జోడించడం ద్వారా ఆమె లుక్‌కు ఆకర్షణీయమైన టచ్‌ను జోడించగా, చిలుక-ఆకుపచ్చ దుస్తులు ఆమె వ్యక్తిత్వాన్ని మరింత హైలైట్ చేశాయి. ఆమె చిరునవ్వు మరియు ఆత్మవిశ్వాసం ఈ రంగులో ప్రకాశించాయి.

– ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు : ఇంటర్వ్యూలో, నీతా తన కెరీర్, రాబోయే ప్రాజెక్టులు మరియు ఆమె శైలిని బహిరంగంగా చర్చించింది. ఆమె ఫిట్‌నెస్, మేకప్ మరియు దుస్తులపై ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, ఆమె వ్యక్తిత్వాన్ని మరింత బలంగా కనిపించేలా ఎలా చేస్తుందో వివరించింది.

– సోషల్ మీడియా రియాక్షన్ : ఇంటర్వ్యూలోని క్షణాల వీడియోలు మరియు ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అభిమానులు ఇలా వ్యాఖ్యానించారు, "ఆమె కళ్ళలోని మెరుపు, గాగుల్స్ వెనుక ఉన్న స్టైల్ – అవి సరిపోలాయి!" కొంతమంది వినియోగదారులు ఇలా రాశారు, "అందం విషపూరితమైనది కావచ్చు... నీతా దానికి ప్రతిరూపం!"

– కెరీర్ మరియు వ్యక్తిత్వం : కొంత సమాచారం ప్రకారం, నీతా శర్మ మోడలింగ్‌తో పాటు నటనలోకి అడుగుపెట్టింది. ఆమె సినీ కెరీర్ వివరాలు ఇంకా బహిరంగంగా ప్రకటించబడనప్పటికీ, ఆమె స్టైల్ సెన్స్ మరియు పబ్లిక్ అప్పియరెన్స్‌లు ఆమె బ్రాండ్ విలువను పెంచుతున్నాయని చెప్పడం సురక్షితం. నీతా శర్మతో ఈ ఇంటర్వ్యూ కేవలం సంభాషణ కాదు. ఇది శైలి, విశ్వాసం మరియు అందం యొక్క మిశ్రమం, ఇది ప్రేక్షకులను ఆకర్షించింది. గాగుల్స్ మరియు చిలుక-ఆకుపచ్చ దుస్తులలో, నేటి యుద్ధ రాయల్‌కు నటన మాత్రమే కాదు, లుక్స్, వ్యక్తిత్వం మరియు శైలి కూడా కీలకమని ఆమె నిరూపించింది. నీతా కొత్త ప్రాజెక్టులు క్షితిజ సమాంతరంగా ఉంటాయి మరియు ప్రేక్షకులు ఆమె ఈ ఆకర్షణీయమైన వైబ్‌ను కొనసాగిస్తుందని మరియు ఆమె నటనా జీవితంలో అదే శక్తిని చూపిస్తుందని ఆశించవచ్చు







Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com